# అయ్యో పాపం.. ఆ కుటుంబం

- అనారోగ్యంతో మంచం పట్టిన ఇంటి పెద్ద
- కూలీ పనికి వెళ్తున్న భార్య
- తల్లికి ఆసరాగా రాగి జావా అమ్ముతున్న బీటెక్ విద్యార్థిని
- ఇంటి ఖర్చుల కోసం పేపర్‌బాయ్‌గా కొడుకు


అనారోగ్యానికి గురైన రాములుతో భార్య, పిల్లలు


రాగి జావ అమ్ముతున్న బీటెక్ విద్యార్థిని

కోల్‌సిటీ, మే 17: అతనికి భార్య, ఇద్దరు పిల్లలు... ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తూ పిల్లలను మంచిగా చదివిస్తున్నాడు.. అందమైన కుటుంబం.. కానీ, ఆ ఆ కుటుంబాన్ని విధి చిన్నచూపు చూసింది... ఒక దాని తర్వా మరొకటి కష్టాలను పరిచయం చేసింది. మనిషిని కుంగిపోయేలా మార్చింది. కిడ్నీ సంబంధిత వ్యాధితో మంచాన పడేసింది. చేతిలో ఉన్న డబ్బులన్నీ డయాలసిస్‌కే ఖర్చయ్యేలా చేసింది.. నెమ్మదిగా కోలుకుంటున్నాడని అనుకోగానే...విధి రాత నుంచి ఎవరూ తప్పించుకోలేరని నిరూపించింది. రోడ్డు ప్రమాదం రూపంలో అతన్ని ఇక శాశ్వతంగా అచేతన స్థితిలో నెట్టివేసింది. అయ్యో పాపం... కష్టాలన్నీ ఆ ఇంటికే వచ్చాయా? అనేలా దీనస్థితిలో పడేసింది. భర్తను దక్కించుకునేందుకు ఆ భార్య కూలీ పనికి వెళ్తుంది. అమ్మకు ఆసరాగా బీటెక్ చదువుతున్న కూతురు రాగి జావ అమ్ముతున్నది. పదో తరగతిలో 452 మార్కులు తెచ్చుకున్న కొడుకు ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి న్యూస్ పేపర్ వేస్తున్నాడు. వెరసి ఆ కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నది.

**విధి ఆడిన వింత నాటకం...**

గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన దుర్గం రాములు ఇదివరకు ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. అతనికి భార్య రేణుక, కూతురు అశ్రిత, కొడుకు వంశీకృష్ణ ఉన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్‌గా, ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సరదాగా సాగిపోతున్న ఆ కుటుంబాన్ని చూసి విధి వెక్కిరించింది. రాములు కిడ్నీ వ్యాధి బారిన పడి కొద్ది కొద్దిగా ఆరోగ్యం క్షీణించి ప్రస్తుతం అచేతన స్థితిలో మంచానికి పరిమితమయ్యాడు. సంపాదించిన డబ్బులన్నీ దవాఖాన ఖర్చులకే అయిపోవడంతో ప్రస్తుతం ఇంట్లోనే మంచాన పడ్డాడు. ఇక అతని భార్య రేణుక ప్రైవేట్ హాస్పిటల్‌లో స్వీపర్‌గా పనికి వెళ్తున్నది. తల్లి కష్టాన్ని చూసి పెద్దపల్లి మదర్ థెరిస్సా కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న కూతురు అశ్రిత రోజూ కాలేజీ అయిపోగానే ఇంటికి వచ్చి మార్కండేయ కాలనీ సెంటర్‌లో రాగి జావ అమ్ముతున్నది. వచ్చే డబ్బులు ఎటూ సరిపోవడం లేదు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి 452 మార్కులు తెచ్చుకున్న కొడుకు వంశీ ఉదయం ఇంటింటికి వెళ్లి న్యూస్ పేపర్లు వేస్తూ పేపర్‌బాయ్‌గా మారాడు.

**ఎవరైనా జీవనోపాధి చూపిస్తే చాలు...**

కష్టాలు, కన్నీళ్లను అనుభవిస్తున్న ఆ ఇల్లాలికి ఎవరైనా జీవనోపాధి చూపిస్తే పిల్లలను చదివించుకుంటానని రేణుక వేడుకుంటున్నది. ఆ కుటుంబ పరిస్థితి తెలుసుకొని శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ 50 కిలోలబియ్యం, 2 నెలలకు సరిపడ సరుకులు, కొంత ఆర్థిక సాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. కూతురు చదువుల ఖర్చులను స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక తరపున సాయం చేస్తామని మద్దెల దినేశ్ ఆ తల్లికి భరోసా ఇచ్చాడు. ఐతే దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు వచ్చి ఆ ఇల్లాలికి ఏదైనా జీవనోపాధి కల్పిస్తే పిల్లలను పోషించుకుంటానని వేడుకుంటున్నారు. సాయం చేయాలనుకునేవారు ఆంధ్రా బ్యాంకు అకౌంట్ నం.117810100105904, ఐఎఫ్ఎస్‌సీ నం.యూబీ1ఎన్0811785, లేదంటే ఫోన్ పే నం.8179716831 ద్వారా చేయూత అందించాలని రాములు కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ముందస్తు సాగుకు సన్నద్ధం కావాలి

- రైతులు మేల్కొంటేనే మేలు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే17: జిల్లాలోని రైతులు ప్రకృతి వైపరీత్యాలతో కలిగే పంటనష్టాలు నివారించుకోవాలంటే ముందస్తు సాగుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష, వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ముందస్తు పంట సాగు చేయడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వానాకాలం పంట జూన్ –అక్టోబర్ వరకు, యాసంగి పంట నవంబర్ –మార్చి వరకు ఉంటుందని పేర్కొన్నారు. కాలక్రమేణా పంటలు మే మొదటి వారం వరకు పొడగింపబడుతుంటంతో ఈదురు గాలులు, అకాల, భారీ వర్షాలు, వడగళ్ల వానల వల్ల వరి, మక్కజొన్న, మిర్చి, కూరగాయలు, పండ్ల తోటలు కోత దశలో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రంలో సాధారణంగా వడగండ్ల వానలు ఏప్రిల్ మాసం నుంచి కురుస్తూ ఉంటాయని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వడగండ్ల వానలను, భారీ వర్షాలను తప్పించుకునే ప్రయత్నంలో భాగంగా వరి పంట ముందస్తు సాగుకు రైతులు సిద్ధమవ్వాలని సూచించారు. వానకాలం వరి పంట సాగును ముందస్తుగా చేపట్టడం వల్ల పంటను అక్టోబర్ మూడవ వారం నుంచి నవంబర్ మొదటి వారం లోపు కోసుకోవచ్చని సూచించారు. యాసంగి వరి నారును నవంబర్ 15 – 20 కల్లా సిద్ధం చేసుకుంటే, పంటను మార్చి 3వ వారం నుండి ఏప్రిల్ మొదటి వారానికల్లా కోసుకోవచ్చుని, ప్రభుత్వం అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.


చెక్కును అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ రాములు యాదవ్

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఓదెల, మే 17: హరిపురం గ్రామంలో ముగ్గురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, మాజీ జడ్పీటీసీ గంట రాములు యాదవ్ శనివారం అందజేశారు. ఎమ్మెల్సీ ఎల్ రమణ సహకారంతో ద్యాగేటి హేమలతకు రూ. 17వేలు, గ్యారడేని రమ్యకు రూ. 12వేలు, వేల్పుల సరోజనకు రూ. 12వేల విలువైన చెక్కులను అందించారు. మాజీ ఉపసర్పంచ్ గ్యారవేని నాగరాజు, నాయకులు వేల్పుల ఐలయ్య, కాసా మహేశ్, కంది అనిల్, మద్దెనవేని రవి తదితరులు పాల్గొన్నారు.

## ఖనిలో కాంగ్రెస్ నాయకుల నిరసన

ఫర్టిలైజర్‌సిటీ, మే 17: కాళేశ్వరంలో చేపట్టిన సరస్వతీ పుష్కరాల్లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విషయంలో ప్రొటోకాల్ పాటించని దేవాదాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం గోదావరిఖని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కామ విజయ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సరస్వతీ పుష్కరాలకు ఎంపీని ఆహ్వానించకపోవడం, ఫ్లెక్సీలో ఎంపీ ఫొటోను ముద్రించకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ కోటేశ్వర్లు, మల్లేశ్, మధు, నర్సింగ్, నరేందర్‌రెడ్డి, కృష్ణ, మహేశ్, శ్రీనివాస్, విజయ్, సుతారి శేఖర్, గొర్రె అజయ్, రైతు శ్రీకాంత్, కళ్యాణ్, శంకర్, సతీశ్, తదితరులు ఉన్నారు.

## రక్తపోటుపై అవగాహన ర్యాలీ

పెద్దపల్లిటౌన్, మే 17: ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో రక్తపోటు నియంత్రణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జీ అన్న ప్రసన్న స్థానిక ప్రభుత్వ దవాఖాన వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఇక్కడ డాక్టర్ ఆర్ రాజమౌళి, ప్రోగ్రాం అధికారి పీహెచ్‌సీ రాగినేడు, రాఘవపూర్ వైద్యులు శ్రావణ్, మమత, డిప్యూటీ వేంకటేశ్వర్లు, టీ రాజేశం, ఎంపీహెచ్ఇవో మధుసూదన్, ఆరోగ్య పర్యవేక్షులు ఉన్నారు.

సుల్తానాబాద్ రూరల్, మే17: మండలంలోని గర్రెపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది, గ్రామస్తులు గ్రామంలో ర్యాలీ తీశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అధిక రక్తపోటు నివారణకు ఆహార అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవాలన్నారు. ఉప్పు తగ్గించుకోవడంతో పాటు వ్యాయామం, యోగా, తదితర వాటిపై ప్రజలు దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం సమాజంలో ఎక్కువ మంది పని ఒత్తిడితో అధిక రక్తపోటుకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధిక బీపీతో పక్షవాతం వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్స్, ఏఎన్ఎంలు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జూలపల్లి, మే 17 : మండల కేంద్రంలో 'ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం' ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, రోగులు, గ్రామస్తులు కలిసి ర్యాలీ తీశారు. మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, నడక అలవాటు చేసుకుని నియంత్రించుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు, శారీరక శ్రమ అలవర్చుకోవాలని పేర్కొన్నారు.

## అవగాహన కల్పించాలి

పెద్దపల్లి కమాన్, మే 17 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బ్యాడ్ టచ్ గుడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయపరమైన అంశాలపై జిల్లా జడ్జి వివరించారు. విద్యార్థులు తల్లిదండ్రులు, బంధువులకు చెప్పుకోలేని విషయాలను ఉపాధ్యాయులతో పంచుకుంటారని, వారికి పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తే బాధిత న్యాయం జరుగుతుందని తెలిపారు. లైంగిక దాడికి గురైన బాలబాలికలు నిర్భయంగా ఫిర్యాదు చేసేలా ఉపాధ్యాయులు వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలని సూచించారు. ఇక్కడ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే స్వప్నరాణి, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్, లోక్ అదాలత్ సభ్యులు కేశ్రీధర్, పీ హరిప్రసాద్, ఏ శ్రీనివాస్, కే అనిల్‌కుమార్, కే అనిత, ఎస్. ప్రతాప చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అస్వస్థతకు గురై 50 గొర్రెల మృత్యువాత

- బొమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఘటన
- సుమారు రూ.5 లక్షలు నష్టం

ధర్మారం, మే 17: బొమ్మారెడ్డిపల్లిలో అస్వస్థతకు గురై రెండు రోజులుగా 50 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 20 గొర్రెలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని గొర్రెల పెంపకం దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొమ్ము కనకయ్య, కొమ్ము రాజేశం, రేచవేని మల్లేశం, సమ్మెడ కొమురయ్య, దాడి నాగయ్య సుమారు 500 గొర్రెలను పెంచుతున్నారు. ఈ గొర్రెలన్నీ గ్రామ శివారులో నిత్యం మేతకు వెళ్తూ ఉంటాయి. ఈ క్రమంలో రెండు రోజులుగా కొమ్ము కనుకయ్య, కొమ్ము రాజేశ్, రేచవేని మల్లేశం, సమ్మెడ కొమురయ్య, దాడి నాగయ్య, గడ్డం కొండాల్ రెడ్డికి చెందిన 50 గొర్రెలు అస్వస్థతకు గురై మరణించినట్లు గొర్రెల పెంపకం దారులు తెలిపారు. వీటికి తోడు మందలోని మరో 40 గొర్రెలు తీవ్ర అస్వస్థత గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని పెంపకం దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు మరణించిన మూగజీవాల విలువ దాదాపు రూ.5 లక్షల వరకు వాటిల్లిందని పెంపకం దారులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం చెల్లించి ప్రభుత్వం తమను ఆదుకోవాలని పెంపకం దారులు విజ్ఞప్తి చేశారు. ధర్మారం వెటర్నరీ డాక్టర్ అజయ్ కుమార్ శనివారం ఆ గ్రామానికి వెళ్లి గొర్రెల కళేబరాలను పరిశీలించారు. గొర్రెల సామూహిక మృత్యువాతపై వెటర్నరి డాక్టర్ అజయ్‌ను వివరణ కోరగా పొలం గట్లపై గడ్డి నివారణ కోసం చల్లిన ఆర్గానో ఫాస్ఫేట్ అవశేషాలను వేయటం వలన గొర్రెలు మరణించి ఉండవచ్చునని ప్రాథమిక అంచనా వేసినట్లు ఆయన వివరించారు. గొర్రెల మృత్యువాతపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని వివరించారు.

## ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య

ఎలిగేడు,మే 17 : వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడానికి ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన విశిష్ఠ సంఖ్య కేటాయిస్తున్నట్లు ఏవో ఎం ఉమాపతి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా భూమి ఉన్న ప్రతిరైతు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు రైతులకు,ప్రజలకు అమలు చేయబడతాయన్నారు. నమోదు కోసం రైతులు తమ భూమి పాస్‌బుక్కు, ఆధార్ నంబర్, ఆర్ లింకు చేసిన మొబైల్ నంబర్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

## కమిషనర్‌కు ఫిర్యాదు

కోల్‌సిటీ, మే 17: రామగుండం నగర పాలక సంస్థ 44వ డివిజన్ పరిధి రమేశ్ నగర్ సమీపంలో కాలువ ఆక్రమణకు గురవుతున్నది. ఈవిషయమై డివిజన్ ప్రజలు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కమిషనర్ (ఎఫ్ఏసీ) జే అరుణ శ్రీకి ఫిర్యాదు చేశారు. రమేష్‌నగర్‌లో గడ్డం జయశంకర్ అనే వ్యక్తి కాలువను ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నాడని పేర్కొన్నారు. కాలువ నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుగా ఫిల్లర్ నిర్మించడంతో భవిష్యత్‌లో అందరికీ ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. అడిగితే దురుసుగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి 15 రోజులు గడిచినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈవిషయమై టౌన్ ప్లానింగ్ ఏసీపీని వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు. రమేష్‌నగర్, కల్యాణ్‌నగర్, ఎల్‌బీ నగర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల కాలంగా అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

## ప్రజా ఉద్యమాలను ఉధృతం చేశాం

పెద్దపల్లి టౌన్, మే 17: తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో బెల్లి లలిత, నల్ల వసంత్, ఆకుల భూమన్న, గద్దర్ అమరత్వంతో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేశామని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కో కన్వనర్ మంథని సంజీవరావు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి మాదన కుమరస్వామి పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా రెండో మహాసభల్లో వారు మాట్లాడారు. రాజ్యహింసకు వ్యతిరేకంగా జిల్లా కమిటీ అనే పోరాటాలు చేపట్టిందన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి కొమురయ్య, ప్రధానకార్యదర్శిగా పులిపాక రవీందర్, ఉపాధ్యక్షులుగా ఆగాండ్ల మల్లేశం, సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు ముడిమడుగుల మల్లన్న, బొంకూరి లక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, విరసం కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మర్వాడి సుదర్శన్, ఎరుకల రాజన్న, జైపాల్‌సింగ్, పీక కిరణ్, పుల్ల సుచరిత, శ్రీపతి రాజగోపాల్ ఉన్నారు.

## కొప్పులపై విప్ ఆరోపణలు హాస్యాస్పదం


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం మే17: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేసిన ఆరోపణలు హాస్యాస్పదమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్ అన్నారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మాజీ మంత్రి ఈశ్వర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి శ్రీధర్ విలేకరులతో మాట్లాడారు. కొప్పుల ఈశ్వర్ నాలుగు సాధారణ అసెంబ్లీ, రెండు ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. పలుమార్లు ఓటమిపాలైన లక్ష్మణ్ కుమార్ మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో జనాన్ని మభ్య పెట్టి సానుభూతితో ఎమ్మెల్యేగా గెలిచాడని విమర్శించారు. విప్ లక్ష్మణ్ కుమార్ మాజీ మంత్రి ఈశ్వర్‌పై విమర్శలు చేయడం మానుకొని ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ధర్మపురిలోమాతా శిశు దవాఖాన, నంది మేడారం లో 30 పడకల దవాఖానను ప్రారంభించడానికి ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. ఈశ్వర్ మంత్రిగా పనిచేసిన హయాంలోనే గొల్లపల్లి మండలానికి గురుకుల పాఠశాల శాశ్వత భవనం నిర్మాణానికి రూ.17 కోట్లు నిధులు మంజూరు చేయించగా, తానే ఆ నిధులు మంజూరు చేయించానని ప్రజలను పక్కదారి పట్టించి ఇటీవల మళ్లీ అక్కడే ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. .అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత సంవత్సరం లోకి సివరేజ్ ప్లాంట్ ఏర్పాటు, డిగ్రీ కళాశాల , రెవెన్యూ డివిజన్, ఏర్పాటు బస్సు డిపో ఏర్పాటు లక్ష్మణ్ కుమార్ ఎందుకు ఏర్పాటు చేయించలేదని ఆయన ప్రశ్నించారు. ఇకనైనా ఈశ్వర్ పై లక్ష్మణ్ కుమార్ విమర్శలు చేయడం మానుకొని హుందాగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో మేడారం సింగిల్ విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లయ్య, సర్పంచుల ఫోరం మాజీ మండల మాజీ అధ్యక్షుడు పూస్కురు జితేందర్ రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుర్రం మోహన్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి మల్లారెడ్డి , నాయకులు ఎండీ రఫీ, మిట్ట తిరుపతి, కూరపాటి శ్రీనివాస్, నాడెం శ్రీనివాస్, దేవి నళినీకాంత్, దేవి వంశీకృష్ణ , ఎగ్గేల స్వామి, కోమటిరెడ్డి మల్లారెడ్డి, ఐత వెంకటస్వామి, కాంపల్లి చంద్రశేఖర్, ఆవుల లత, రెడపాక శ్రీనివాస్, గంధం నారాయణ, ఆవుల శ్రీనివాస్, ఆవుల వేణుగోపాల్, దీటి శ్రీనివాస్, గంధం తిరుపతి, సాయిరి కుమార్, రాగుల చిన్న మల్లేశం, పాలమాకుల తిరుపతిరెడ్డి, బొలిశెట్టి సుధాకర్, దేవి రాజారాం, నేరెళ్ల చిన్న లచ్చయ్య, పుట్ట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న రఘువీర్ సింగ్ దంపతులు

## రఘువీర్‌సింగ్ దంపతుల సాయం

జూలపల్లి, మే 17 : పేదింటి ఆడబిడ్డల పెండ్లి ఖర్చులు తీర్చుకోడానికి తనవంతు ఆర్థికసాయం చేయడానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఆయన సతీమణి మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ప్రీతిరఘువీర్‌సింగ్ ముందుకు వచ్చారు. శనివారం వారి పెండ్లి రోజును పురస్కరించుకుని పెద్దాపూర్‌లో పుల్లకోల్ల సంధ్య, అబ్బాపూర్ గ్రామానికి చెందిన పసునూటి విద్యారాణికి శనివారం 'నేనున్నా' స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ. 5 వేల చొప్పున నగదు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆ దంపతులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పత్తిపాక సింగిల్ విండో వైస్ చైర్మన్ పసునూటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు దండె వెంకటేశం, నాయకులు గాండ్ల చంద్రయ్య, తొగరు శ్రీనివాస్, ఈర్ల మల్లేశం, చొప్పరి శేఖర్, కొమ్మ రాజేశం, పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, గోస్కుల రాజేందర్, నిట్టు కొమురయ్య, సంకెండ్ల లక్ష్మణ్, పూరెల్ల గంగయ్య, గుండు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలకు ప్రభుత్వ ప్రత్యేక గుర్తింపు


ఎంవోయూ పత్రాన్ని అందుకుంటున్న డైరెక్టర్ నవత

పెద్దపల్లి రూరల్, మే 17: పెద్దబొంకూర్‌లోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు నిస్తూ సంబంధిత ఎంవోయూ పత్రాన్ని అందజేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎడవల్లి నవతకు సీఎం రేవంత్‌రెడ్డి అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎడవల్లి నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. 26 ఏళ్లుగా పెద్దపల్లి ప్రాంత విద్యార్థులకు ఆధునిక విద్యావిదానాలను అందజేస్తూ ఎప్పటికప్పుడు ఎమర్జింగ్ కోర్సులను, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్న కోర్సులను ప్రవేశ పెట్టడంలో ఉత్తర తెలంగాణలోనే మొదటి స్థానంలో ఒదని తెలిపారు. ప్రస్తుతం ఐటీ సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ,మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి కోర్సులను మొట్టమొదటగా ప్రవేశపెట్టి గత ఐదేళ్లుగా ఈ ప్రాంత విద్యార్థులకు తమ ముంగిట్లో నాణ్యమైన విద్యను అందించడం సంతోషంగా గర్వంగా ఉందన్నారు. తమ కళాశాల నైపుణ్యాన్ని గుర్తించి వీ హబ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి శ్రీనివాస్, అధ్యాపకబృందం, యాజామాన్యం తరపును ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

## అభివృద్ధి పనులు పరిశీలించి.. సూచనలు చేసి

పెద్దపల్లి, మే17: పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో జరగుతున్న అమృత్ భారత్ అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే (సికింద్రాబాద్) జనరల్ మేనేజన్ అరుణ్ కుమార్ జైన్ శనివారం పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యాలు, వసతులు ఆరా తీశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ. 26.49 కోట్ల వ్యయంతో పెద్దపల్లి స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు పరిశీస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డీఆర్ఎం భరతేశ్ కుమార్, సీనియర్ డివిజనల్ మేనేజర్(కమర్షియల్) బాలాజీ, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వినతి పత్రాల స్వీకరణ...**

పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని, రైల్వే స్టేషన్‌లోని వివిధ సమస్యలపై డీఆర్‌యూసీసీ రైల్వే కమిటీ సభ్యుడు ఎన్డీ తివారి, జీఎంకు వినత పత్రం అందించారు. తెలంగాణ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్‌కు చర్యలు తీసుకుంటున్నట్లు జీఎం తెలిపారు. రైల్వే గూడ్స్ పార్సిల్ సర్వీసును కొనసాగించాలని, హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పెద్దపల్లి రైల్వే హమాలీ కో –ఆపరేటివ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జంగ సంపత్ యాదవ్, రైల్వే జీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ఇక్కడ హమాలీ సంఘం డైరెక్టర్లు చిట్టవేణి మోహన్, చిట్టవేణి శ్రీశైలం, దాగేటి రవి, పాలేటి వెంకటేశ్, శ్రీనివాస్, సభ్యులు రాజేశం, సంపత్, రాజ్‌కుమార్, రాజు, రాజేందర్ ఉన్నారు.

## వైద్య శిబిరం

పెద్దపల్లి, మే17: ప్రపంచ అధిక రక్తపోటు నియంత్రణ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో పాత్రికేయులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీబీపీ, థైరాయిడ్, తదితర టెస్టులు చేశారు. వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజమౌళి, డాక్టర్ స్వాతి, ల్యాట్ టెక్నీషియన్ అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్య వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

రామగిరి, మే 17ః సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు నిత్య వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, సింగరేణి సంస్థ కూడా అభివృద్ధి చెందుతుందని ఆర్జీ–3,ఏపీఏ జీఎంలు సుధాకర్ రావు, కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. రక్తపోటుపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించి ఉద్యోగులకు పంపిణీ చేశారు. డాక్టర్ కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు సంతోష్‌కుమార్, కోట రవీందర్, అధికారుల సంఘం కార్యదర్శి గ్రంథి శ్రీనివాసరావు, ఎస్ఓటు జీఎంలు బండి సత్యనారాయణ, బీ.సత్యనారాయణ, పీఓలు పీ.శ్రీనివాసులు, రాంమ్మోహన్, చంద్రశేఖర్, సుదర్శనం, నాగేశ్వరరావు, సుధాకర్, ఐలయ్య, డా.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలను విజయవంతం చేయండి

గోదావరిఖని, మే 17: జూన్ 15న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నాయకులు కనకరాజ్, గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, తాళ్ళపల్లి మల్లయ్య, మడికొండ ఓదెమ్మ, రమేశ్‌కుమార్, రమ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## మాట తప్పితే కోర్టుకీడుస్తాం

- మరమ్మతు పనులు నాణ్యతగా చేయాలి
- నాగెపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకుల స్పష్టం

రామగిరి, మే 17: సింగరేణి బ్లాస్టింగ్ విధ్వంసంతో నాగెపల్లిలో దెబ్బతిన్న ఇండ్లను పూర్తి స్థాయిలో సర్వే చేసి మరమ్మతు పనులను నాణ్యతగా చేయాలనీ, లేదంటే సింగరేణి అధికారులను కోర్టుకీడుస్తామని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, రైతుబంధు అధ్యక్షుడు మేదరవేని కుమార్, మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు డిమాండ్ చేశారు. దెబ్బతిన్న ఇండ్లను సింగరేణి మరమ్మతు పనులను శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బ్లాస్టింగ్ విధ్వంసం జరిగిన రోజున బాధితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో రోడ్డెక్కి దిగ్బంధం చేస్తే పోలీసు అధికారులు, సింగరేణి జీఎం సుధాకర్ రావును తీసుకవచ్చి హామీ ఇప్పించారని తెలిపారు. దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు చేపడుతామనీ, కొత్త రేకులు వేసి కొత్త వస్తువులు కొనుగోలు చేసి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇటు చూస్తే పనులు నాసిరకంగా ఉంటున్నాయనీ, ఏదో నామమాత్రంగా చేసి చేతులు దులుపుకోవాలని చూస్తే కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. జీఎం హామీ ఇవ్వడంతోనే గ్రామస్తులు శాంతించి అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. ఆ బ్లాస్టింగ్‌ల వల్ల నాగెపల్లి సీ బ్లాక్ ప్రజలకు ప్రమాదం ఉన్నందున వారికి మరోచోట పునరావసం కల్పించిన తర్వాతనే బ్లాస్టింగ్‌లు చేసుకోవాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కాపురవేన భాస్కర్, నాయకులు వేగోలపు శ్రీనివాస్, చిట్టంపల్లి అనిల్, కొండవేన ప్రభాకర్, కొండవేన సుధాకర్, పోలు సంతోష్, చంటి, సంతు, సారయ్య, బాపు, కలవేన వెంకటేష్, మల్యాల శ్రీనివాస్, సారయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

PLOT FOR SALE
★KNR తీగలగుట్టపల్లిలో KCR బిల్డింగ్ దగ్గర అయోధ్యనగర్‌లో 50 & 30 ఫీట్ల రోడ్లతో 194 చ.గ.ల టు ఫేసింగ్ ప్లాటు అమ్మబడును. సెల్: 96183 37209, 76710 65100.
NTK-330283

FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

BUSINESS OFFER
★Wanted Investor for Gents Hair Cutting Saloon Business at Hyderabad. Good Returns. Contact: 7075526841, 7075519740.
NT-Raju Yadav

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189